# 3

# అవసరమైనది: కాపరి హృదయాలు

## (యెహెజ్కేలు 34:1-6)

చాలా సంవత్సరాల క్రితం నేను, నా భార్య టర్కీ, గ్రీకు ప్రాంతాలకు వెళ్ళేందుకు ఒకరు సహాయం చేశారు. మేము ప్రయాణంలో ఉండగా, “మనం భోజనంలో తిన్న మాంసం ఏంటి?” అని ఒకాయన మరొకతన్ని అడిగాడు. అందుకాయన, “అందేంటో నాకు తెలియదు కానీ అది బా ... నే ... ఉంది” అని అన్నాడు. మేమక్కడ ఉండగా చేపలు, కొంచెం చికెన్ తిన్నాము, కానీ ఎక్కువగా మటన్ తిన్నాము. ఆ దేశాల్లో ప్రజలు ఎక్కువగా గొర్రెలను మేపుతారు. బైబిలు కాలంలోనూ ఆ ప్రాంతంలో అదే జరిగేది. సొలొమోను దేవాలయాన్ని ప్రతిష్ఠించినప్పుడు, 120,000 గొర్రెలను బలిగా అర్పించారు (2 దినవృత్తాంతములు 7:5). కాబట్టి, గొర్రెలు, దాని సంబంధ విషయాలు వాక్యంలో కనబడడం మామూలే.

బైబిల్లో గొర్రెలను గురించి ఎన్ని వాక్యభాగములున్నాయో నేను లెక్క చూచాను. బైబిల్లో 187 సార్లు గొర్రెలను గురించి, 191 సార్లు మందను గురించి, 83 సార్లు కాపరుల గురించి వ్రాయబడింది. అందులోనూ మొత్తం 461 సార్లు పేర్కొనబడ్డ ఇందులో మందను కాయడం, శ్రద్ధవహించడం వంటి విషయాలు చేర్చబడలేదు. బైబిలు గ్రంథకర్తలు గొర్రెలు మరియు కాపరుల గురించి చెప్పారు. ఎందుకంటే ప్రజలకు అదే సులభంగా అర్థమయ్యేది. దీన్ని టెక్సాస్‌లోని వారికి పశువులతో పోల్చి చెప్తే అర్థమవుతుంది. టెక్సాస్ ప్రాంత వాసులకు పశువుల గురించి బాగా అర్థమవుతుంది.

వాక్య సాదృశ్యాలలో, గొర్రెలు ఎక్కువగా వాడుటకు గల మరో కారణం కూడా ఉంది. అది, గొర్రెల స్వభావం, గొర్రెల స్వభావాన్ని తెలిపే మూడు ఆంగ్ల పదాలు “W”తో ప్రారంభమవుతాయి. నేను వాటిని విన్నాను, మొదటి రెండు వ్యతిరేక అర్థాన్నిస్తున్నా మూడవది సానూకూల అర్థాన్నిస్తుంది.

- *బలహీనమైనవి* (*Weak*). గొర్రెలు ఎదురించలేవు, అడవి గొర్రెలు బండలను కుమ్ముతుంటాయి కానీ ఇల్లలో పెంచుకునేవి. ఏ మాత్రం ఎదురించలేవు. వాటికి వేగం కూడా తెలియదు. వాటికి కొమ్ములుండవు. అవి క్రూర మృగాలకు సులభంగా ఆహారమైపోతాయి (యెషయా 13:14; 1 సమూయేలు 17:34). *గొర్రెలు భద్రం చేయబడాలి* (చూడండి మీకా 5:8).
- *బయట తిరుగాడేవి* (*Wanderers*). గొర్రెలు ఎక్కువగా బయట తిరుగాడేందుకు ఇష్టపడుతుంటాయి. కానీ అవి అలా బయటకు పోతే, సులభంగా వెనక్కు రాలేవు (చూడండి యెషయా 53:6; కీర్తనలు 119:176). గుఱ్ఱం లేదా గేదెలు సులభంగా ఇళ్ళకు చేరుకోగలవు గాని ఇవి చేరలేవు. *గొర్రెలకు మార్గం చూపబడాలి.*
- *విలువైనవి* (*Worthwhile*). గొర్రెల మీదనే ఆధారపడి ఎంతో మంది బ్రతుకుతున్నారు. వాటి బొచ్చు ద్వారా మనకు వస్త్రాలు లభిస్తాయి (యోబు 31:20)

మరియు అలాగే మనకు ఆహారం దొరుకుతుంది, ఆడగొర్రె పిల్లలను పెంచుతుంది. ఇదివరకు గొర్రెల సంఖ్యను బట్టి ఒక వ్యక్తి సంపదను లెక్కించేవారు. ఉదాహరణకు, యోబుకు 14,000 గొర్రెలు ఉండేవి (యోబు 42:12).

గొర్రెలు, కాపరుల గురించి వాక్య బోధనను చూద్దాము. కొన్ని సూత్రాలను తయారు చేసుకునేందుకు పాతనిబంధనతో మన అధ్యయనాన్ని ప్రారంభిద్దాం.

## గొర్రెలు మరియు కాపరులు విషయమై పాతనిబంధన బోధన

### ప్రధాన కాపరి మరియు "కాపరి-క్రిందివారు"

పాతనిబంధనలో, దేవుడు ప్రధాన కాపరిగా వివరించబడ్డాడు. ఆయన ప్రజలు ఆయన మందగా వర్ణించబడ్డారు. కీర్తన 80:1లో దేవుడు "ఇశ్రాయేలు కాపరిగా" పిలువబడ్డాడు. దేవుడ్ని సూచించుటకు అనేక కీర్తనలు అదే పదజాలన్ని వాడుతున్నాయి. (కీర్తనలు 78:52; 79:13; 95:7; 100:3). అందరికీ పరిచితమైన కీర్తనలు 23, "యెహోవా నా కాపరి ..." అని ప్రారంభమవుతుంది (1 వచనం). మరో మంచి వాక్యం యెషయా 40లో కనబడుతుంది: "గొర్రెల కాపరివలె ఆయన తన మందను మేపును, తన బాహువుతో గొర్రె పిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును. పాలిచ్చు వాటిని ఆయన మెల్లగా నడిపించును" (11 వచనం).[1]

దేవుని మందను కాచేందుకు, నడిపించేందుకు, పోషించేందుకు "కాపరి క్రిందివారుగా" కొంతమందిని దేవుడు నియమించాడు. ఈ బాధ్యత విషయమై మనం యాజకులను, ప్రవక్తలను ముందుగా తలంచుతాము; అయితే రాజులు ఇతర నాయకులు కూడా దేవుని మంద కాపరులే. యెషయా 63:11లో మోషే కూడా దేవుని ప్రజల కాపరులలో ఒకనిగా ఎంచబడ్డాడు. రాజైన దావీదు తన ప్రజలను మందగానే చూసేవాడు (2 సమూయేలు 24:17; 1 దినవృత్తాంతములు 21:17). దేవుడు అన్యరాజైన కోరేషును కూడా మంద కాపరి అని పిలిచాడు (యెషయా 44:28). ఒక వ్యక్తి ఇతరుల బాధ్యతను చూస్తుంటే, అతడు కాపరిగానే ఎంచబడ్డాడు.

### కాపరి లేని గొర్రెలు

గొర్రెలు బలహీనమైనవి, ఎదురాడలేనివి, కాబట్టి కాపరి లేకపోతే అవి సంరక్షణ, భద్రత లేకుండా దయనీయస్థితిలో ఉంటాయి. ప్రజలకు సరైన నాయకత్వం లేకుంటే, వారు కాపరిలేని గొర్రెల వంటి వారు. యెహోషువా మోషేకు కుడి భుజసహాయంగా నియమింపబడ్డాడు. తద్వారా "ఇశ్రాయేలీయులు కాపరి లేని గొర్రెలవలె ఉండకుండయున్నారు" (సంఖ్యాకాండము 27:17). రాజైన అహాబు మరణం గురించి ఇలా ప్రవచనం చెప్పబడింది: "ఇశ్రాయేలీయులందరూ కాపరి లేని గొర్రెలువలెనే కొండల మీద చెదరియుండుట నేను చూచితిని వారికి యజమానుడు లేడు" (1 రాజులు 22:17ఎ; చూడండి 2 దినవృత్తాంతములు 18:15, 16).

విషాదంగా, పాత నిబంధనలో ఎక్కువ భాగం దేవుని యొక్క "కాపరి-క్రింది వారి"

వైఫల్యాలే ఎక్కువగా కనబడుతున్నాయి. యిర్మీయా ఇలా వ్రాస్తున్నాడు,

"నా ప్రజలు త్రోవతప్పిన గొఱ్ఱెలుగా ఉన్నారు;
వారి కాపరులు కొండమీదికి వారిని తోలుకొని పోయి వారిని త్రోవ తప్పించిరి ..." (యిర్మీయా 50:6ఎ).

"కాపరులు పశుప్రాయులై
యెహోవా యొద్ద విచారణ చేయరు
గనుక వారే వర్ధిల్లకయున్నారు, వారి మందలన్నియు చెదరిపోవుచున్నవి" (యిర్మీయా 10:21).[2]

వారి బలహీన నాయకత్వం బట్టి, గొఱ్ఱెలు పోషణ లేక చెదరిపోయాయి. అవి చెదరిపోయి మృగాలకు బలైపోయాయి.

... యెహోవా మంద చెరపట్టబడినందున ... (యిర్మీయా 13:17).

"ఇశ్రాయేలు వారు చెదరిపోయిన గొఱ్ఱెలు" (యిర్మీయా 50:17ఎ).

"... కాబట్టి గొఱ్ఱెలుమంద తిరుగులాడునట్లు జనులు తిరుగులాడిరి, కాపరి లేక బాధ నొందిరి" (జెకర్యా 10:2).

దేవుడు దీని విషయమై ఎలా స్పందించాడు? (ఇది *ఆయన గొఱ్ఱెలని* గుర్తుంచుకోండి.) యిర్మీయా 13:20బిలో కాపరి–క్రిందివారికి ఒక ప్రశ్న అడుగబడింది: "నీకియ్యబడిన మంద నీ సౌందర్యమైన మంద ఎక్కడనున్నది?" కాపరిక్రింది వారు దేవుని మందను నిర్లక్ష్యం చేసినప్పుడు, దేవుడు వారిని ఖండించాడు:

"యెహోవా వాక్కు ఇదే – నా మందలో చేరిన గొఱ్ఱెలను నశింపజేయుచు చెదరగొట్టి కాపరులకు శ్రమ" (యిర్మీయా 23:1).

"నా కోపాగ్ని మండుచు కాపరుల మీద పడును" (జెకర్యా 10:3).[3]

తమ బాధ్యతలో వైఫల్యం చెందిన కాపరి క్రిందివారిని గురించిన పాతనిబంధన వాక్యం యెహెజ్కేలు 34లో కనబడుతుంది:

"మరియు యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను – నరపుత్రుడా, ఇశ్రాయేలీయుల కాపరులను గూర్చి ఈ మాట ప్రవచింపుము, ఆ కాపరులతో ఇట్లనుము ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా – తమ కడుపు నింపుకొను ఇశ్రాయేలీయుల కాపరులకు శ్రమ, కాపరులు గొఱ్ఱెలను మేపవలెను గదా. మీరు క్రొవ్విన గొఱ్ఱెలను వధించి క్రొవ్వును తిని బొచ్చును కప్పుకొందురు గాని గొఱ్ఱెలను మేపరు, బలహీనమైన వాటిని బలపరచరు, రోగముగలవాటిని స్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టుకట్టరు. తోలివేసిన వాటిని మరల తోలుకునిరారు. తప్పిపోయిన వాటిని వెదకరు, అది మాత్రమే గాక మీరు కఠినమనస్కులై బలాత్కారముతో వాటిని ఏలుదురు. కాబట్టి కాపరులు లేకయే అవి చెదరిపోయెను, చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారమాయెను. నా గొఱ్ఱెలు పర్వతములన్నిటి మీదను ఎత్తయిన ప్రతి కొండమీదను తిరుగులాడుచున్నవి, నా గొఱ్ఱెలు భూమి యందంతట చెదరిపోయినను వాటిని గూర్చి విచారించు వాడొకడును లేడు, వెదుకువాడొకడునులేడు" (1–6 వచనాలు).

ఈ వాక్యం కాపరుల బాధ్యతలను గురించి చెప్తుంది. కాపరులు గొఱ్ఱెలను బలపరిచి గాయపడిన వాటికి కట్టుకట్టాలి. చెదిరిపోయిన వాటిని వెదకి తీసుకురావాలి. మందను భద్రం చేయాలి అయితే యెహెజ్కేలు చెప్తున్న ఆత్మీయ కాపరులు వీటిని చేయలేదు. దీని ఫలితం 8వ వచనంలో చెప్పబడింది: "కాపరులు లేకుండా నా గొఱ్ఱెలు దోపుడు సొమ్మయి సకలమైన అడవి మృగములకు ఆహారమాయెను." తమ బాధ్యతను నెరవేర్చని కాపరి క్రిందివారి పరిస్థితిని 9, 10 వచనాలు చెప్తున్నాయి:

> "కాబట్టి కాపరులారా, యెహోవా మాట ఆలకించుడి. ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా, నా జీవము తోడు నేను ఆ కాపరులకు విరోధినైతిని, నా గొఱ్ఱెలను గూర్చి వారి యొద్ద విచారించెదను. వారు గొఱ్ఱెలు మేపుట మాన్పించెదను, ఇకను కాపరులు తమ కడుపు నింపుకొనజాలక యుందురు; నా గొఱ్ఱెలు వారికి తిండికాకుండా వారి నోటనుండి వాటిని తప్పించెదను, ఇదే ప్రభువైన యెహోవా వాక్కు."

తరువాత వచనాల్లో దేవుడే వాటిని సంరక్షిస్తాడని, తన క్రింది కాపరులు చేయలేని వాటిని ఆయనే చేస్తాడని చెప్పబడింది. ఇది బహుశ బబులోను చెరలోను చెరనుండి విడిపించి పునర్ధరించిన ప్రజలను మరియు నెహెమ్యా ఎజ్రా వంటి ఆత్మీయ నాయకులను నియమించిన దానిని సూచిస్తుంది. అయితే, ఈ వాక్యం స్పష్టంగా రాబోవు ప్రధాన కాపరి యేసును గురించినదే అని స్పష్టమవుతుంది. "యెహోవానైన నేను వారికి దేవుడనైయుందును. నా సేవకుడైన దావీదు వారి మధ్య అధిపతిగా ఉండును; ... నేను వారితో సమాధానార్థ నిబంధన చేయుదును" అని 24, 25 వచనాల్లో చూస్తున్నాం.

పాతనిబంధన ముగింపులో కూడా గొఱ్ఱెలు మరియు కాపరుల అంశం కొనసాగింది. మందలో శేషించినవారు తిరిగి చేర్చబడతారని (మీకా 2:12; యిర్మీయా 23:3) మరియు నూతనమైన కాపరులను – మందను మేపే కాపరులు నియమించబడతారని (యిర్మీయా 23:4) ప్రవక్తలు ముందే చెప్పారు. ఇక్కడ యిర్మీయా 3:15 గుర్తించదగ్గది: "నాకిష్టమైన కాపరులను మీకు నియమింతును, వారు జ్ఞానముతోను వివేకముతోను మిమ్మునేలుదురు."

## గొఱ్ఱెలు మరియు కాపరుల గురించి క్రొత్తనిబంధన బోధన

### మంచి కాపరి

మంచి కాపరియైన, క్రీస్తు యొక్క రాకను గురించి పాతనిబంధనలో చెప్పబడింది. క్రొత్త నిబంధన అంతటిలోనూ క్రీస్తు కాపరిగా వివరించబడ్డాడు. ఉదాహరణకు క్రీస్తు ఎక్కడ పుడతాడని హేరోదు శాస్త్రులను అడగడం మత్తయి 2:4లో కనబడుతుంది. అందుకు వారు "యూదయ దేశపు బేత్లెహేమా" అని చెప్పి మీకా 5:2 వాక్యమును ఉదహరిస్తున్నారు. బేత్లెహేము విషయమై "ఇశ్రాయేలును నా ప్రజలను పరిపాలించు[4] అధిపతి నీలోనుండి వచ్చును" (5, 6 వచనాలు).

"నశించిన దానిని వెదకి రక్షించేందుకు" యేసు వచ్చారు (లూకా 19:10). ఇందులో "ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెలు" ఉన్నాయి (మత్తయి 10:6). ప్రజలు "కాపరి లేని గొఱ్ఱెల వలె" చెదరిపోవడం చూసి యేసు కనికరపడ్డాడు (మత్తయి 9:36; చూడండి మార్కు 6:34). ఆయన చెప్పిన ఉపమానాల్లో తప్పిపోయిన గొఱ్ఱెను వెదకి మందలో

చేర్చడం కూడా ఒకటి (లూకా 15:3-7; చూడండి మత్తయి 18:12-14). "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను" అని యేసు తన శిష్యులతో అన్నారు (మత్తయి 10:16ఎ). "చిన్న మందా, భయపడకుడి" అని ఆయన అభయమిచ్చాడు (లూకా 12:32ఎ).[5]

యేసును కాపరిగా వివరించే ప్రధాన వాక్యం యోహాను 10లో కనబడుతుంది. ఆ గొప్ప అధ్యాయం నుండి కొన్ని మాటలు ఇక్కడ ఇయ్యబడ్డాయి:

> "గొఱ్ఱెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొను వాడునైయున్నాడు. ద్వారాముున ప్రవేశించువాడు గొఱ్ఱెల కాపరి. అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును, గొఱ్ఱెలు అతని స్వరము వినును, అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును ... . గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును" (1-4 వచనాలు).

> "నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణముపెట్టును ... . తండ్రి నన్ను ఏలాగున ఎరుగునో నేను తండ్రిని ఏలాగు ఎరుగుదునో అలాగే నేను నా గొఱ్ఱెలను ఎరుగుదును, నా గొఱ్ఱెలు నన్ను ఎరుగును. మరియు గొఱ్ఱెల కొరకు నా ప్రాణము పెట్టుచున్నాను. ఈ దొడ్డివి కాని వేరే గొఱ్ఱెలును[6] నాకు కలవు; వాటిని కూడా నేను తోడుకొని రావలెను అవి నా స్వరము వినును అపుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగును" (11-16 వచనాలు).

> "నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును" (27 వచనం).

ఈ వాక్యం నుండి నేర్చుకునే పాఠాల్లో నిజమైన కాపరి యొక్క నిస్వార్థ స్వభావం కూడా ఒక పాఠం. "జీతగాడు" తన గురించి మాత్రమే ఆలోచిస్తాడు కానీ నిజమైన కాపరి తన మంద క్షేమం గురించి ఆలోచిస్తాడు.

క్రొత్త నిబంధన అంతటిలోనూ, యేసు మన కాపరి అన్న భావన కొనసాగుతుంది. ఆయన "గొఱ్ఱెల గొప్ప కాపరి" (హెబ్రీయులకు 13:20). "మీ ఆత్మల కాపరి, అధ్యక్షుడు" అని యేసు గురించి పేతురు చెప్తున్నాడు (1 పేతురు 2:25).[7] దావీదు చెప్పిన విధంగా "యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు" అని మనం చెప్పగలగాలి (కీర్తనలు 23:1).

## "కాపరి-క్రిందివారు"

పాతనిబంధనలో, దేవుని "కాపరి-క్రిందివారు" ఉన్నట్లు చూశాము: తన మంద మీద ఆయన నియమించిన వారు, ఆయన బాధ్యత ఇచ్చి దానికి జవాబుదారీతనం ఆశిస్తూ నియమించిన వారిని గురించి చూశాము. అలాగే యేసుకు కూడా "కాపరి-క్రిందివారు" ఉన్నారు. స్థానిక సంఘంలో వీరిని "పెద్దలు," "విచారణకర్తలు" ("అధ్యక్షులు"; KJV), మరియు "కాపరులు" (pastors) అని పిలుస్తారు. ఈ నాయకుల గురించి మూడు ప్రధాన వాక్యభాగములను పరిశీలిద్దాము.

మొదటిది అపొస్తలుల కార్యములు 20లో కనబడుతుంది. పౌలు యెరూషలేము మార్గంలో నున్నప్పుడు మిలేతు దగ్గర ఆగాడు. "అతడు మిలేతు నుండి ఎఫెసునకు వర్తమానము పంపి సంఘపు పెద్దలను పిలిపించెను" అని 17వ వచనంలో కనబడుతుంది. పెద్దలు వచ్చినప్పుడు

పౌలు వారితో సుదీర్ఘంగా (18–35 వచనాలు) మాట్లాడాడు. ఇందులో ఎఫెసు సంఘం పట్ల వారి బాధ్యతను వివరించాడు. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు[8] పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (28 వచనం) అని చెప్పాడు. ఎఫెసు సంఘ నాయకులు మొదట "పెద్దలుగా" పిలువబడ్డారు. దీనికి "పెద్దవారు" అని అర్థం ఈ పెద్దలను పరిశుద్ధాత్ముడు "అధ్యక్షులుగా" (bishops; KJV) నియమించాడు. చివరిగా, వారు మందను "కాయవలెనని" (క్రియారూపమైన *poimen* నుండి వచ్చింది) పౌలు కోరుతున్నాడు. పెద్దలు ఈ విధంగా వివరించబడ్డారు:

- *పరిపక్వత* నొందినవారు (*maturity*) – "పెద్దలు" అనే పదంలో సూచింబడింది.
- *పరిపాలన* చేయువారు (*management*) – "పై విచారణ కర్తలు" అనే పదం సూచిస్తుంది.
- ముఖ్యంగా, పని చేయువారు (*mission*) – "కాపరులు" అనే పదం సూచించినట్టు పెద్దలు తమ పనిని, ఉద్దేశాన్ని గుర్తించాలి.

ఎంత గొప్ప బాధ్యత కాపరికుంది! మందను కాచేందుకు ఎఫెసు పెద్దలకు సూచనలిస్తున్నప్పుడు పౌలు యొక్క హృదయంలో ఇది ఎంతో గొప్ప సవాలు:

> నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు. కావున నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్లు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసుకొని మెలకువగా ఉండుడి (అపొస్తలుల కార్యములు 20:29–31).

రెండవ వాక్యభాగం ఎఫెసీయులకు 4:11, 12లో కనబడుతుంది: "పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన (దేవుడు) కొందరిని అపొస్తలులనుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులనుగాను, కొందరిని కాపరులను గాను ఉపదేశకులనుగాను నియమించెను." ఇక్కడ సంఘం యొక్క విభిన్న పరిచర్య ధర్మాలను పౌలు ఇస్తున్నాడు. ఇందులో కొన్ని తాత్కాలికమైనవి (అపొస్తలులు, ప్రవక్తలు వంటివి). మరికొన్ని శాశ్వతమైనవి (సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు వంటివి) "కాపరి" (pastor) అన్న పదం *poimen* నుండి వచ్చింది. ఇదే కాపరి (గొఱ్ఱెల కాపరి) అన్న మాటకూ వాడబడింది. ఇది పెద్దలను సూచిస్తుంది. దేవుడు ఎందుకు ఈ పాత్రలను (పెద్దలతో కలిపి) ఇచ్చాడో చూడండి: "పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు, క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును." ఇక్కడ ప్రధాన విషయం మంద (క్రీస్తు శరీరం) యొక్క క్షేమాభివృద్ధి, మందను పోషించడం, కాయడం, భద్రపర్చడం ద్వారా కాపరులు మందకు క్షేమాభివృద్ధిని కలుగజేస్తారు. ఆరోగ్యమైన మంద మరో ఆరోగ్యమైన మందను అందిస్తుంది.

మూడవ వాక్యభాగము 1 పేతురు 5:1–4లో కనబడుతుంది:

> “తోటి పెద్దను, క్రీస్తు శ్రమలను గూర్చిన సాక్షిని, బయలుపరచబడబోవు మహిమలో పాలివాడనునైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను. బలిమిచేత కాక దేవుని చిత్త ప్రకారము ఇష్టపూర్వకము గాను, దుర్లాభాపేక్షతో గాక సిద్ధమనస్సుతోను, మీ మధ్యనున్న దేవుని మందను పై విచారణ చేయుచు దానిని కాయుడి. మీకు అప్పగింపబడిన వారిపైన ప్రభువులైనట్టుండక మందకు మాదిరిలుగా ఉండుడి. ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు.”

పెద్దలు కాయడం గురించి ఈ వాక్యంలో ఆంగ్లంలో మూడు “R’s”లలో చెప్పబడింది:

- పెద్దల *పని* (*role*). పెద్దలను గురించిన మూడు పదాలు (“పెద్దలు,” “కాపరులు,” “విచారణ కర్తలు”) ఈ వాక్యంలో కనబడతాయి. పర్యాయపదాలుగా వాడబడ్డాయి. ఇక్కడ “మీ మధ్యనున్న దేవుని మంద” అన్న మాటపై దృష్టియుంచబడింది.
- పెద్దల యొక్క *బాధ్యత* (*responsibility*). (1) పెద్దలకు సరైన *పరిచర్య* ఉండాలి అది మందను సరిగా కాయడం. అందులో నడిపించడం, పెంచడం, భద్రం చేయడం ఉంటాయి. హెబ్రీ గ్రంథకర్త సంఘనాయకుల గురించి చెప్తూచూ వారు “మీ ఆత్మలను కాయుచున్నారు” (హెబ్రీయులకు 13:17) అని వ్రాస్తున్నాడు. వారి ప్రధాన బాధ్యత సంఘం యొక్క ఆస్తులు, అంతస్థులను కాయడం కాదు గాని ఆత్మలను కాయడం. (2) పెద్దలకు సరైన *ఉద్దేశం* ఉండాలి. వారు సిద్ధమనస్సుతో బుద్ధిపూర్వకంగా పరిచర్యచేయాలి. (3) పెద్దలకు సరైన *ప్రవర్తనా విధానం* ఉండాలి. మందకు “ప్రభువులైనట్టు కాక” మందకు మాదిరిగా ఉండాలి.
- పెద్దల యొక్క బహుమానం (*reward*): “వాడబారని మహిమ కిరీటము.” కిరీటం అనేది *stephanos* నుండి వచ్చింది. ఇది జయ సూచికమైన సౌందర్య శిరోలంకరణ.

**కాపరి హృదయాలు**

నేను చెప్పాల్సిందంతా ఇదే: *పెద్దలకు కాపరి హృదయం అవసరం. అలా అని పెద్దలకు మాత్రమే కాపరి హృదయం అవసరం* అని నేను చెప్పడం లేదు! కాపరి హృదయం గల నాయకులను తయారు చేసేందుకు సంఘంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి హృదయం కల్గియుండేలా చూడాలి.

యోహాను 21లోని కథను చూడండి. మంచికాపరిగా యేసును చూపించిన యోహాను (10 అధ్యాయం) ఈ సంఘటనను కూడా తన గ్రంథంలో పొందుపరిచాడు. ఇది క్రీస్తు భూమిమీద తన అంత్యదినాల్లో గలిలయ అద్దరిన జరిగిన సంఘటన. యేసు తన శిష్యులకు కనిపించాడు, ముమ్మారు యేసును ఎరుగనని బొంకిన పేతురు కూడా ఆయన కనిపించాడు. యేసు పేతురుతో ఇలా సంభాషించాడు:

> “... వారు భోజనము చేసిన తరువాత యేసు సీమోను పేతురును చూచి–యోహాను కుమారుడునైన సీమోనూ, వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా? అని అడుగగా అతడు – అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవె యెరుగుదువని ఆయనతో చెప్పెను. యేసు–నా గొఱ్ఱెపిల్లలను మేపుమని అతనితో చెప్పెను. మరల ఆయన – యోహాను కుమారుడవైన సీమోనూ, నన్ను ప్రేమించుచున్నావా? అని

> రెండవసారి అతనినడుగగా అతడు–అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను; ఆయన–నా గొఱ్ఱెలను కాయుమని చెప్పెను. మూడవసారి ఆయన–యోహాను కుమారుడవైన సీమోనూ, నన్ను ప్రేమించుచున్నావా? అని అతనిని అడిగెను. – నన్ను ప్రేమించుచున్నావా అని మూడవసారి తన్ను అడిగినందుకు పేతురు వ్యసనపడి – ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు, నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను. యేసు – నా గొఱ్ఱెలను మేపుము ... అని అతనితో చెప్పెను" (యోహాను 21:15–17).

నిజానికి యేసు పేతురుతో మూడుసార్లు ఒకే విషయాన్ని చెప్పాడు. అయితే, కొంచెం భిన్నమైన పదాలను వాడారు. యేసు మొదటిసారి పేతురుతో – "నా గొఱ్ఱెపిల్లలను మేపుము"[9] అన్నాడు. రెండవసారి – "నా గొఱ్ఱెలను కాయుము"[10] అన్నాడు. మూడవసారి – "నా గొఱ్ఱెలను మేపుము" అన్నాడు. పేతురు యేసు ఆజ్ఞకు లోబడ్డాడు. అతడు ఆత్మలను కాయు కాపరి అయ్యాడు (1 పేతురు 5:1).

ఈ సంఘటనలో మనం నేర్చుకోదగ్గ పాఠాలున్నాయి. మన జీవితంలోని ప్రాధాన్యతలను సవరించు కోవాలన్నదే ఇందులోని ప్రాథమిక పాఠం. కాపరి హృదయాలను కలిగియుండేందుకు మనం ప్రయత్నిస్తున్నామా? ప్రజల అవసరతలను గురించి మనం పట్టించుకుంటున్నామా? యేసు పేతురుతో మాట్లాడినట్లుగానే మనతోనూ, మన భుజం మీద ఆయన చెయ్యివేసి మాట్లాడుతున్నారనుకోండి:

- "నీవు నన్ను ప్రేమిస్తున్నావా, నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?"
- "వీటన్నిటి కంటె (మన జీవితంలో ప్రధానం అనుకుంటున్నవి) ఎక్కువగా నన్ను ప్రేమిస్తున్నావా?"
- "అయితే నా గొఱ్ఱెపిల్లలను మేపుము; నా మందను కాయును; నేను ప్రేమించిన వాటిని శ్రద్ధచేయి."

ప్రతి తల్లి, తండ్రి ఈ పాఠాన్ని హృదయపూర్వకంగా గ్రహించాలి. ప్రభువు విలువైన ఆత్మలను మనకు అప్పగించారు మనం వాటిని ప్రేమించాలి, శ్రద్ధ చేయాలి, సంరక్షించాలి అందరూ ఆ పాఠాన్ని గ్రహించాలి. మందలోని గొఱ్ఱెలు చెదరిపోయాయి మరి కాపరులు ఎక్కడ? ఇది పెద్దలకు మాత్రమే కాదు, అందరికీ సంబంధించిన ప్రశ్న. *కాపరి హృదయం గలవారు ఎక్కడ?* చెదరిన వాటిని తిరిగి మందలో చేర్చే వారు ఎక్కడ (చూడండి గలతీయులకు 6:1; యాకోబు 5:19, 20)?

## ముగింపు

గొఱ్ఱెలు, కాపరులను గురించిన పాఠాలు, అనగా ప్రేమతో నడిపించే అవసరత, ప్రతి ఒక్కరూ ఇతరులకు కాపరిగా ఉండి నడిపించడం వంటివి మనకందరకూ అవసరమైనవి. ముగించబోయే ముందు రాబోవు పెద్దల నియామకం అన్న పాఠంపై దృష్టియుంచుదాము. అర్హతగల వారిని నియమించే ముందు, కాపరి హృదయం గలవారి కోసం చూడడం మరువవద్దు.

## గమనిక

పెద్దలను ఎన్నుకుని నియమించే ప్రక్రియ సమయం దగ్గరపడుతుండగా, దేవుని సహాయం మనతో కూడా ఉండాలని ప్రార్థనతో ఈ పాఠాన్ని ముగిస్తున్నాను. దేవుని మందయైన సంఘంలో క్రియాశీల పాత్రను పోషించే అవసరతను గురించాలన్నది నా ప్రార్థన (చూడండి అపొస్తలుల కార్యములు 2:36–38, 41, 47).

గొఱ్ఱెలు, కాపరుల గురించి వాక్యం ఏ చెప్తుందన్న విషయమై నేను చేసిన అధ్యయనం నాకు సంతోషాన్నిచ్చింది. నిస్సందేహంగా నేను ఎన్నో వనరులను ఉపయోగించాను. కానీ అవేంటో నాకు గుర్తులేదు అందు నిమిత్తమై కొందరికి ధన్యవాదాలు చెప్పాలి గానీ నన్ను క్షమించండి. ఇందుకు నేను ప్రధానంగా అకారాది సూచిక (concordance)ను ఉపయోగించాను. దీన్నింతటిని ఒక్క ప్రసంగంలో బోధించడం కష్టం అయితే మీరు పనిచేస్తున్న ప్రాంతానికనుగుణంగా మీకు ఏది సరిపోతుందో దాన్నే మీరు తీసుకోవచ్చు.

ఈ అధ్యయనం అంతటిని బోధించే కంటే, దేవుని నాయకులను వివరించేందుకు ఉన్న కాపరి అన్న పదం ఉన్న ఒక్క వాక్యభాగం మీద దృష్టియుంచవచ్చు. ఇందుకు యెహెజ్కేలు 34 మంచి వాక్యభాగం.

---

సూచనలు

[1]మిగతా వాక్యభాగల్లో జెకర్యా 9:16; 10:3 కూడా ఉంది. [2]చూడండి యెషయా 56:11. [3]మరో వాక్యం యిర్మీయా 25:34. [4]KJVలో “ఏలడం” (rule) అని ఉంది. కానీ దీని గ్రీకు పదం “కాపరి” పదం యొక్క మరోపదం *poimen* యొక్క క్రియారూపం. [5]కాపరిగా క్రీస్తును గురించిన వాక్యాలు ఎన్నో ఉన్నాయి. తన మరణానికి ముందు క్రీస్తు జెకర్యా 13:7 వాక్యాన్ని ఉదాహరించారు. కాపరి (యేసు) కొట్టబడితే గొఱ్ఱెలు (శిష్యులు) చెదిరిపోతాయి (మత్తయి 26:31; మార్కు 14:27). [6]“ఇతర గొఱ్ఱెలు” అన్యులను సూచిస్తుంది. [7]కీర్తనలు 2:9 ప్రకటన గ్రంథంలో యేసుకు మూడుసార్లు (2:27; 12:5; 19:15) అన్వయించబడింది, “ఇనుప దండముతో ఏలును” “ఏలడం” అను మాట యొక్క క్రియాపదం దీనికి “కాయడం” అని అర్థం. [8]KJVలో “మేపడం” (పోషించడం) అని ఉంది. ఇది కాపరి బాధ్యతల్లో ఒకటి. [9]KJVలో ప్రతిసారి “మేపడం” అనే ఉంది కానీ పేతురుతో మాట్లాడినప్పుడు మూడు వేరు పదాలను యేసు ఉపయోగించారు. రెండవదిగా NASBలో “కాయడం” అని అనువదించబడిన పదం *poimen* యొక్క క్రియారూపం. [10]“గొఱ్ఱెలు” యొక్క గ్రీకుపదం *probaton*. యేసు దీని సంక్షిప్త వాచక రూపాన్ని *probation* ఉపయోగించారు. దీనికి “చిన్న మంద” అని అర్థం. (W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* [Nashville: Thomas Nelson Publishers, 1985], 569.)